క్లుప్తంగా

సమయపాలన పాటించకుంటే చర్యలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న లక్ష్మీపతి

కొమ్మాది : సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని భీమిలి డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీపతి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే ఆయన వచ్చిన సమయానికి సచివాలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇది పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేనేత కార్మికులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

భీమునిపట్నం : మన దేశంలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అటువంటి వస్త్రాలను తయారు చేస్తున్నన్న చేనేత కార్మికులను అందరూ ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించాలని, తద్వారా దీనిపై ఆధారపడిన కార్మికులకు చేయూత ఇచ్చేవారవుతారన్నారు. ఈ విషయంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సహకరించాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి



అంబేడ్కర్ కూడలిలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన ప్రదేశం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ అంబేడ్కర్ కూడలిలో మంగళవారం పైప్‌లైన్ జాయింట్ వదిలేయడంతో బుధవారం కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వెంటనే తాగునీటి సరఫరా సిబ్బంది స్పందించి పైప్‌లైన్ జాయింట్‌కు మరమ్మతులు చేసి ఆ ప్రాంతంలో కాంక్రీట్ వేశారు. బుధవారం నాటికి ఈ ప్రాంతంలో పైప్‌లైన్ సురక్షితంగా ఉంటడంతో గురువారం నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే శిక్ష తప్పదు



మాట్లాడుతున్న ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు బుధవారం అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు, చట్టపరమైన ఇబ్బందులకు గురికావద్దన్నారు. వారికి వాహనాలు ఇచ్చేవారు కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. రోడ్లపై నడిచి వెళ్లేటప్పుడు కూడా నిబంధనలు పాటించి నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలనూ ఆక్రమించేస్తాం

- టీడీపీ నాయకుల అండతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- మారికవలసలో 900 గజాల స్థలం కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు



మారికవలస వైపు ఆక్రమణకు సిద్ధం చేసిన గెడ్డ స్థలం



జాతీయ రహదారిని ఆనుకుని ఆక్రమణకు టీడీపీ నాయకుడు చదును చేసిన గెడ్డ స్థలం

మధురవాడ : టీడీపీ నాయకుల అండతో ఆక్రమణదారులు గెడ్డలనూ కబ్జా చేసేస్తున్నారు... ప్రభుత్వ స్థలం కనిపించగానే ఆక్రమణకు సిద్ధమైపోతున్నారు... గెడ్డ, శ్మశానం, కొండ, వాగు అన్న తేడా లేకుండా నాలుగు రూపాయలు వస్తాయనుకుంటే సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇదీ విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం, మారికవలస పరిసర ప్రాంతాల్లోని పరిస్థితి. ఈ ప్రాంతంలో ఆక్రమణల్లో ఆరితేరిన టీడీపీ నాయకుడి అండతో కొందరు రెచ్చిపోతున్నారు. మారికవలస జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని వున్న సొంత స్థలానికి ఆ టీడీపీ నాయకుడి అండతో ఓ ప్రైవేటు వ్యక్తి అక్రమంగా రోడ్డు నిర్మించేశాడు. ఇందుకోసం జాతీయ రహదారుల సంస్థకు చెందిన సుమారు 500 గజాల స్థలం ఆక్రమించేసినా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇదే అదునుగా టీడీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు ఇంకో అడుగు ముందుకేసి రెండుచోట్ల ప్రభుత్వ గెడ్డ స్థలాన్ని ఆక్రమించేశాడు. బోరవానిపాలెం వైపు ఉన్న ఓ ప్రైవేటు లే అవుట్‌ని ఆనుకుని ఉన్న గెడ్డను చదును చేసేసి 200 గజాల స్థలం కబ్జా చేసేశాడు. అదే గెడ్డలో జాతీయ రహదారి వైపు వున్న మరో 200 గజాల స్థలం కూడా ఆక్రమించేశాడు. కొద్ది రోజులుగా యంత్రాల సాయంతో ఈ స్థలాలు చదును చేసేసి ఆక్రమించేశారు. సుమారు రూ.4 కోట్ల విలువ చేసే స్థలం దర్జాగా కబ్జా చేసేసినా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అధికారులంతా మొద్దు నిద్రలో...

కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమణదారులు కబ్జా చేసేస్తున్నా జీవీఎంసీ, రెవెన్యూ, స్థానిక సచివాలయ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జాతీయ రహదారికి సంబంధించిన స్థలంలో ప్రైవేటు వ్యక్తి రోడ్డు నిర్మించేస్తుంటే నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేట్టాల్సి వున్నా వారు ఇటువైపు చూడనే లేదు. ఆక్రమణపై స్థానిక అధికారులు ఎవరూ వారికి సమాచారం కూడా ఇవ్వలేదు. మరోవైపు గెడ్డలు పరిరక్షించాల్సిన బాధ్యత జీవీఎంసీ, రెవెన్యూ అధికారులదే అయినప్పటికీ ఎవరూ పట్టించుకునే దాఖలాలు లేవు. ఆక్రమిత స్థలాలకు అధికారులంతా కూతవేటు దూరంలోనే వున్నప్పటికీ... ఏమీ కనిపించనట్లు.. ఏమీ చూడనట్లు మొద్దు నిద్ర నటిస్తుండడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గెడ్డ, జాతీయ రహదారి స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు నిర్మించిన రోడ్డు

వైఎస్సార్‌సీపీ జెండా తొలగింపుపై ఫిర్యాదు

మధురవాడ : వైఎస్సార్ సీపీ జెండా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ 5వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకర అప్పారావు జోనల్ కమిషనర్ శైలజావల్లికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీలోని వార్డు సచివాలయాల గోడలపై వున్న టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించకుండా, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు తమ పార్టీకి చెందిన జెండా దిమ్మ, జెండా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరగా... జెడ్సీ శైలజావల్లి సానుకూలంగా స్పందించారని తెలిపారు. చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అప్పారావు తెలిపారు.



జోనల్ కమిషనర్ శైలజావల్లికి ఫిర్యాదు చేస్తున్న వంకర అప్పారావు

కుండపోత వర్షం

తగరపువలస : భీమిలి పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు ముంపునకు గురయ్యాయి. ఈ కారణంగా రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం అనంతరం రహదారులపై చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పారిశుధ్య సిబ్బంది పనులు చేపట్టి చెత్తను తొలగించారు. తగరపువలస ప్రైవేట్ మార్కెట్, ఆనందపురం కూరగాయల మార్కెట్ బురదమయమయ్యాయి. చెరువులు నిండుకుండల్లా కనిపించాయి. బుధవారం నుంచి పెళ్లిళ్లు ప్రారంభం కావడంతో వర్షం కారణంగా మధ్యాహ్నం జరిగే విందు భోజనాలకు స్వల్పంగా ఆటంకం కలిగింది. కొన్ని విద్యా సంస్థలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించారు.



తగరపువలస అంబేడ్కర్ కూడలిలో కురుస్తున్న వర్షం

వర్షంతో వరి పైరుకు మేలు

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వర్షం కుసింది. ఈ వర్షం వరి పంటకు మేలు చేకూర్చుతుందని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, ఇసకలపాలెం, మద్ది, అర్చకునిపాలెం తదితర గ్రామాల్లో ఇప్పటికే వరి నాట్లు పూర్తయ్యాయి. ఆ నాట్లుకు వర్షం మేలు చేకూర్చింది.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

పద్మనాభం : పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ ఆంజనేయులు సూచించారు. ఉపాధి హామీ పథకం కార్యాలయంలో వీఆర్పీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న రైతులు పండ్ల తోటల పెంపకానికి అర్హులన్నారు. మామిడి, సపోటా, కొబ్బరి, జామ, నిమ్మ వంటి పండ్ల తోటలను రైతులతో వేయించాలన్నారు. ఈ తోటలు వేసి పెంచేందుకు ప్రభుత్వం తరపున మూడళ్ల వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తామన్నారు. పశువులు, గొర్రెలకు షెడ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గడ్డి పెంపకం, కంపోస్టు పిట్లు నిర్మాణానికి చేయూత అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీవో వరలక్ష్మి, వీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ ఆంజనేయులు

దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

పీఎంపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కొన్ని దళిత సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దళిత నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఎంపాలెంలోని ఆఖరు బస్టాపు వద్ద గల ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర దళిత హితకారిణి సభ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎస్.పి.చక్రవర్తి మాట్లాడారు. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చన్న తీర్పుతో 70 శాతం ఎస్సీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఐక్యంగా ఉన్న ఎస్సీలను విభజించి లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎస్సీలకు సంబంధించి ఏం తెలుసని ప్రశ్నించారు. ఈ తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. దళిత రాజకీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నిడగట్లు నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి బోని అప్పలరాజు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడిగట్లు రాజారావు, గుడివాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నా దళిత సంఘం నాయకులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

మహారాణిపేట: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)కు చెందిన బియ్యాన్ని బుధవారం పౌర సరఫరాల శాఖాధికారులు పట్టివేశారు. డీఎస్‌వో సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. డాబాగార్డెన్‌లో అనధికారికంగా ఓ వాహనంలో రవాణా చేస్తున్న పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. అగనంపూడి, పెదమాదక ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తగరపువలసలో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4,700 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు.

12లోపు దరఖాస్తు చేసుకోవాలి

భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో చేరడానికి ఈ నెల 12లోపు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి బుధవారం తెలిపారు. ఈ కోర్సులో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫిజిక్స్ అధ్యాపకులు బి.ప్రసాదరావును 8179780917 సంప్రదించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

తగరపువలస : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య రూ.10 వేలు వంతున మొత్తం రూ.1.4 లక్షల జరిమానా బుధవారం విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరగడంతోపాటు భారీగా జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస : చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అంతరాయం కారణంగా భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కొమ్మాది : లా కాలేజీ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల వల్ల గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఎం.రాజేష్ తెలిపారు. దిశ పోలీస్ స్టేషన్, జీవీఎంసీ పంప్‌హౌస్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, దుర్గానగర్, వారాహినగర్, శ్రీనివాసనగర్, సందీప్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

కొలెస్ట్రాల్ తగ్గించడంలో స్టాటిన్స్ పాత్ర కీలకం

కొమ్మాది : కొలెస్ట్రాల్ తగ్గించడంలో స్టాటిన్స్ పాత్ర కీలకమని, ముఖ్యంగా ఎక్కువ కొలెస్ట్రాల్ ఉన్నవారిలో గుండె జబ్బులను తగ్గించేందుకు ఉపయోగపడతాయని డాక్టర్ రెడ్డీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పరిమళ్ మిశ్రా అన్నారు. గీతంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాలేయం ఉత్పత్తి చేసే కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గించడానికి సహాయపడతాయని తెలిపారు. అయితే స్టాటిన్స్ ప్రభావం శరీరంపైనా వుంటుందన్నారు.

నేతన్నలకు అండగా నిలుద్దాం

తగరపువలస : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భీమిలి ఎంఈవో – 2 జయప్రద బంగ్లామెట్ట విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలకు అండగా నిలుద్దామని సూచించారు. అలాగే జాతీయ గేయ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు తెలియజేశారు. భారతదేశ జన్యు శాస్త్ర, హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ జయంతి సందర్భంగా ఆయన గురించి కూడా విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.



బంగ్లామెట్టలో విద్యార్థులతో ఎంఈవో జయప్రద

ఎనీ టైమ్ పేమెంట్ యంత్రాల ఏర్పాటుకు చర్యలు

తగరపువలస : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం చిట్టివలస, ఆనందపురం, భీమిలి, పద్మనాభం కూడళ్లలో ఎనీ టైమ్ పేమెంట్ యంత్రాల ఏర్పాటు కోసం కార్పొరేట్ కార్యాలయానికి అభ్యర్థన పంపుతున్నట్టు ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు జి.శ్యాంబాబు తెలిపారు. 'విద్యుత్ బిల్లుల చెల్లింపులకు కష్టాలు' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. బిల్లు కలెక్టర్ల టూర్ ప్రోగ్రాంలో భాగంగా వారంలో రెండు రోజులపాటు చిట్టివలస అర్బన్, చిట్టివలస రూరల్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని గ్రామాలకు కలెక్షన్‌కు వెళ్తారన్నారు. నగదు రహిత లావాదేవీలు, సురక్షిత చెల్లింపులను ప్రోత్సహించడానికి జూన్ 1 నుంచి ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల వసూళ్ల ప్రారంభించామన్నారు. ఈ యాప్ ఉపయోగించి సులువుగా బిల్లులు చెల్లించడానికి వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కరపత్రాలు, సోషల్ మీడియా, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. అలాగే ఈఆర్‌వోలో రోజూ బిల్లుల వసూళ్లకు సిబ్బంది అంటుబాటులో వుంటారని తెలిపారు.

నిలిచిపోయిన మార్కెట్ కమిటీ భవన నిర్మాణం

భీమునిపట్నం : భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గత ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఎప్పటికి పూర్తవుతుందో ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడి విశాలమైన ప్రాంతంలో 30 సంవత్సరాల క్రితం మార్కెట్ కమిటీ భవనం నిర్మించారు. అందులోనే కార్యాలయం ప్రారంభించి రైతులతో సమావేశాలు నిర్వహించేవారు. రెండేళ్ల కిందట ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తది నిర్మాణం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు పనులు ప్రారంభించారు. అయితే సగం పనులు పూర్తయ్యేసరికి ఎన్నికలు రావడంతో మధ్యలో నిలిచిపోయాయి. ప్రస్తుతం కమిటీ కార్యాలయాన్ని భీమిలి చిన్నబజారు ప్రాంతంలో అద్దె భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. కొత్త భవనం పూర్తికావడానికి ఇంకా అవసరమైన నిధులు ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేయాల్సి వుంది. వెంటనే మిగిలిన నిధులు విడుదల చేసి, భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం

కొత్తపేటలో అధ్వానంగా పారిశుధ్యం



కొత్తపేటలో డ్రైనేజీ నుంచి రహదారిపై ప్రవహిస్తున్న మురుగు



ఎర్రయ్యపాలెం బీచ్ రహదారిపై మురుగునీరు

తగరపువలస : భీమిలి మండలం అన్నవరం పంచాయతీ కొత్తపేట గ్రామం మురికికూపంగా మారిపోయింది. దివీస్ లేబొరేటరీ నుంచి ఎర్రయ్యపాలెం బీచ్‌కు వెళ్లే రహదారి మురుగు కుంటలా తయారైంది. ఇక్కడ డ్రైనేజీలు పూడుకుపోయి మురుగు గ్రామంలో విస్తరించింది. ఈ గ్రామంలోనే ఇతర రాష్ట్రాలకు చెందిన దివీస్ కార్మికులు అద్దెకు నివశిస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో వీరంతా వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాలు లేకుండానే పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే... వర్షాలు ఎక్కువగా కురిస్తే మా పరిస్థితి ఏమిటని కొత్తపేట వాసులు వాపోతున్నారు. ఒకవైపు సీజనల్ వ్యాధులపై అవగాహన పేరుతో తూతూ మంత్రంగా అధికారులు వచ్చి వెళ్లిపోవడం తప్ప... పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ప్రబలక ముందే పారిశుధ్య పనులు చేపట్టాలని కొత్తపేట వాసులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా చేతిబోర్లు



పీఎం పాలెం పరిధి గాయత్రినగర్‌లో నిరుపయోగంగా వున్న చేతిబోరు



అలంకారప్రాయంగా చేతి బోరు

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పీఎం పాలెం గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నిర్మించిన బోరుబావులు పనిచేయడం లేదని, అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 19 బ్లాకులుగా నిర్మించిన ఈ కాలనీలో 576 కుటుంబాలు నివసిస్తున్నాయి. తాగునీటి అవసరాలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తుండగా, వాడుక నీటి కోసం జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం 5 బోరింగులు నిర్మించింది. అందులో 2 కొన్ని నెలలుగా పని చేయకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మిగతా మూడు బోర్లు అరకొరగా పని చేస్తుండడంతో వాడుక నీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. వెంటనే జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి పనిచేయని బోరింగులు పునరుద్ధరించి నీటి సమస్య తీర్చడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో మంగళవారం అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బోనిల త్రినాథరావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు బియ్యం, నిత్యావసర సరకులు బుధవారం అందించారు. సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలస్వామి చేతుల మీదుగా అందించారు. ఇంకా వీరికి తుపాకుల సురేష్, పిన్నింటి అప్పలసూరి, ఉప్పాడ శ్రీను, గుడ్డాల అప్పలరాజు, వసంత నరసింగరావు, బోనిల శివ, అంజూరి మాధవ, గిన్ని దుర్గారావు, బట్టు అప్పన్న, కొండపు బంగారురెడ్డి తదితరులు సహాయ సహకారాలు అందించారు.



బియ్యం, నిత్యావసర సరకులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జల్ జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆనంద్ సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సురక్షితమైన తాగునీరు, చేతులు శుభ్రం చేసుకోవడంపై తెలియజేశారు. స్కూల్ దగ్గర, గ్రామంలో నీటి నమూనాలు సేకరించి పరీక్షించారు. డయేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జల్ జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆనంద్